

రంజాన్ వేళలు
ఇఫ్తార్ : సోమవారం సా : 6.36 గం.
సహర్ : మంగళవారం ఉ : 4:42 గం.

ఐరిస్‌తో అక్రమాలకు చెక్

- ధాన్యం కొనుగోళ్లలో దళారీ వ్యవస్థ కట్టడికి సరికొత్త విధానం
- జిల్లా వ్యాప్తంగా 418 కొనుగోలు కేంద్రాలు
- ఇప్పటి వరకు 300 కేంద్రాలు ప్రారంభం



సిద్దిపేట అగ్రికల్చర్, ఏప్రిల్ 7: ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో అక్రమాలకు చెక్ పెట్టేందుకు ప్రభుత్వం పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నది. అందులో భాగంగానే ఐరిస్ విధానాన్ని తీసుకొచ్చింది. గతంలో ఆధార్ నమోదు, ఓటీపీ ద్వారా రైతుల నుంచి ధాన్యం సేకరించేవారు. ప్రస్తుతం ఓటీపీతో పాటు ఐరిస్ విధానం అమలు చేస్తున్నారు. ఈ సరికొత్త విధానంతో దళారీ వ్యవస్థకు అడ్డుకట్ట పడనుంది.

దళారులకు తావివ్వొద్దని

గతంలో కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తీసుకొచ్చే వారి ఆధార్ నంబర్, బ్యాంక్ ఖాతాను ఆన్‌లైన్‌లో నమోదు చేయగానే ఆ రైతు సెల్‌ఫోన్‌కు ఓటీపీ వచ్చేది. ఆ నంబర్‌ను నమోదు చేసి ధాన్యం కొనుగోలు చేసేవారు. అయితే రైతుల పేరుతో వ్యాపారులు, దళారులు ధాన్యం కొనుగోలు కేంద్రాలలో విక్రయించకుండా ఉండేందుకు అధికారులు ఐరిస్ విధానం అమలు చేయాలని నిర్ణయించారు. ఈమేరకు ధాన్యం విక్రయించే రైతులు కచ్చితంగా కొనుగోలు కేంద్రానికి రావాల్సి ఉంటుంది. ప్రస్తుతం ధాన్యం తూకం చేసిన తర్వాత కొనుగోలు కేంద్రం నిర్వాహకులు రైతుల ఐరిస్ తీసుకుంటారు. అందుకు అవసరమైన ఐరిస్ యంత్రాలను, కొనుగోలు కేంద్ర నిర్వాహకులకు పౌరసరఫరాల శాఖ అధికారులు వారికి శిక్షణ సైతం అధికారులు అందించారు.

పకడ్బందీగా ధాన్యం కొనుగోళ్లు

జిల్లాలో 3.50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించాలని అధికారులు లక్ష్యంగా నిర్దేశించుకున్నారు. ఈ మేరకు పీఏసీఎస్‌ల ఆధ్వర్యంలో 202, ఐకేపీల ఆధ్వర్యంలో 210 , మెప్మా ఆధ్వర్యంలో 6 మొత్తం 418 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించుకున్నారు. ఇప్పటి వరకు 300 కేంద్రాలకు పైగానే ప్రారంభించారు. మరో పక్షం రోజుల్లో వరి కోతల ముమ్మరం కానున్నాయి. రైతులకు అవసరమైన గన్నీ బ్యాగులను కూడా సిద్ధంగా ఉంచారు. జిల్లావ్యాప్తంగా 85 లక్షలకు పైగానే గన్నీ బ్యాగులు అవసరం కాగా.. 65 లక్షల గన్నీ బ్యాగులు అందుబాటులో ఉన్నాయి. మిగిలిన వాటిని కూడా రైతులకు అందుబాటులో ఉంచేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులూ కలగకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నామని అధికారులు తెలిపారు.

రైతులు కచ్చితంగా కేంద్రాలకు రావాలి

గతంలో ఆధార్, బ్యాంక్ ఖాతా, ఓటీపీ ద్వారా ధాన్యం కొనుగోళ్లు జరిగేవి. ఇక నుంచి ఐరిస్ అమలులోకి వచ్చింది. అయితే కంటి సమస్య ఉన్నవారికి, వృద్ధులకు ఐరిస్ అవ్వకపోతే ఓటీపీ ద్వారా ధాన్యాన్ని కొనుగోలు చేస్తాం. ధాన్యాన్ని విక్రయించే రైతులు కచ్చితంగా కొనుగోలు కేంద్రానికి రావాలి. ఐరిస్ విధానంపై నిర్వాహకులకు శిక్షణ కూడా నిర్వహించాం. రైతులకు ఇబ్బందులు లేకుండా కొనుగోలు చేస్తాం.

\- తనూజశ్రీ, డీఎస్‌వో



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న అధికారులు



ఎండ ప్రచండం

- సిద్దిపేటలో 43.9 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత
- మెదక్ జిల్లాలో 43.2 డిగ్రీలు, సంగారెడ్డి జిల్లాలో 42.5 డిగ్రీలుగా నమోదు
- సాధారణం కంటే 5 డిగ్రీలు అధికం
- ఉమ్మడి జిల్లాకు కొనసాగుతున్న ఆరెంజ్ అలర్ట్
- 7 గంటల నుంచే ఎండ.. 10 గంటలకే రోడ్లన్నీ నిర్మానుష్యం

మెదక్, ఏప్రిల్ 7: ఎండలు ఠారెత్తిస్తున్నాయి. ఉదయం 7 గంటల నుంచే సుర్రు మంటున్నది. ఉక్కపోత, వడగాలులకు జనాలు బెంబేలెత్తుతున్నారు. ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 5 డిగ్రీలు అధికంగా నమోదవుతున్నాయని వాతావరణశాఖ పేర్కొంటున్నది. దీంతో, నాలుగు రోజులుగా ఉమ్మడి జిల్లాలో ఆరెంజ్ అలర్ట్ కొనసాగుతున్నది. ఉష్ణోగ్రతలు సాధారణానికి మించి 5 డిగ్రీలు అధికంగా నమోదైతే ఆరెంజ్ అలర్ట్, 6 డిగ్రీలకు పైగా అధిక ఉష్ణోగ్రతలతో పాటు వడగాల్పులు ఉంటే రెడ్‌అలర్ట్ ప్రకటిస్తారు.



చిన్నకోడూరు మండలం అల్లీపూర్‌లో వ్యవసాయ బోరు వద్ద కొడుకు దాహార్తిని తీరుస్తున్న తల్లి

రికార్డుస్థాయిలో ఉష్ణోగ్రతలు

ఉమ్మడి జిల్లాలో ఆదివారం ఈ సీజన్‌లోనే గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. సిద్దిపేట అర్బన్ మండలంలో 43.9 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదయింది. మెదక్ జిల్లా రేగోడులో 43.2 డిగ్రీలు, కోహీర్ మండలం దిగ్వాల్‌లో 42.5 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. వీటితో పాటు ఉమ్మడి జిల్లా పరిధిలో పలు మండలాల్లో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. దీంతో, ఆయా మండలాల్లో ఆరెంజ్ అలర్ట్ ప్రకటించారు.

మరికొన్ని రోజులు ఇదే మంట

ఉమ్మడి జిల్లా పరిధిలో మరికొద్ది రోజులు ఎండల తీవ్రత కొనసాగే అవకాశముందని వాతావరణశాఖ వెల్లడించింది. ఎండల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ఎండలో బయటకు వెళ్లకూడదని, మధ్యాహ్నం లోపే పనులు ముగించుకుని ఇళ్లకు చేరుకోవాలని, తిరిగి సాయంత్రం 4 గంటల తర్వాతే బయటకు వెళ్లాలని సూచిస్తున్నారు. అత్యవసరంగా బయటకు వెళ్లాల్సి వస్తే ఎండ నుంచి రక్షణ కోసం టోపీలు, గొడుగులు ఉపయోగించాలని, కళ్లకు సన్‌గ్లాసెస్ ధరించాలని పేర్కొంటున్నారు.



నిర్మానుష్యంగా మారిన సిద్దిపేట పట్టణంలోని ముస్తాబాద్ చౌరస్తా



ఎండకు తట్టుకోలేక చెట్ల నీడన సేదతీరుతున్న జీవాలు

ఉష్ణోగ్రతలు ఇలా..

- సిద్దిపేట జిల్లాలోనే అత్యధికంగా సిద్దిపేట అర్బన్ మండలంలో 43.9 డిగ్రీలు, కుకునూర్‌పల్లిలో 43.7 డిగ్రీలు, చేర్యాలలో 43 డిగ్రీలు, దూళ్‌మిట్టలో 42.9 డిగ్రీలు, తొగిటలో 42.6 డిగ్రీలు, బెజ్జంకిలో 42 డిగ్రీలు, మద్దూర్‌లో 41.9 డిగ్రీలు, అక్కన్నపేటలో 41.9 డిగ్రీలు, కొమురవెల్లిలో 41.8 డిగ్రీలు, నారాయణ్‌రావుపేటలో 41.5 డిగ్రీలు, కోహెడలో 41.4 డిగ్రీలు, మర్కుక్‌లో 41.2 డిగ్రీలు, కొడ్‌పాకలో 41 డిగ్రీలు, నంగునూర్‌లో 40.9 డిగ్రీలు, దౌల్తాబాద్‌లో 40.8 డిగ్రీలు, చిన్నకోడూరులో 40.8 డిగ్రీలు, గజ్వేల్‌లో 40.7 డిగ్రీలు, దుబ్బాకలో 40.5 డిగ్రీలు, మిర్‌దొడ్డిలో 40.3 డిగ్రీలు, జగదేవ్‌పూర్‌లో 40.1 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదైనట్టు వాతావరణశాఖ ప్రకటించింది.
- మెదక్ జిల్లా రేగోడులో 43.2 డిగ్రీలు, వెల్దుర్తిలో 42 డిగ్రీలు, పాపన్నపేటలో 41.1 డిగ్రీలు, కొల్చారంలో 41.1 డిగ్రీలు, చిన్నశంకరంపేటలో 41 డిగ్రీలు, శివ్వంపేటలో 40.8 డిగ్రీలు, రామాయంపేటలో 40.6 డిగ్రీలు, మాసాయిపేటలో 40.5 డిగ్రీలు, మనోహరాబాద్‌లో 40.5 డిగ్రీలు, చిలప్‌చేడ్‌లో 40.4 డిగ్రీలు, చేగుంటలో 40.4 డిగ్రీలు, మెదక్‌లో 40.1 డిగ్రీలు, కౌడిపల్లిలో 40.1 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.
- సంగారెడ్డి జిల్లాలోని కోహీర్‌లో 42.5 డిగ్రీలు, కల్హేర్‌లో 42 డిగ్రీలు, జహీరాబాద్‌లో 41.6 డిగ్రీలు, సదాశివపేటలో 41.6 డిగ్రీలు, జిన్నారంలో 41.5 డిగ్రీలు, కందిలో 41.4 డిగ్రీలు, చౌటుకూర్‌లో 41.2 డిగ్రీలు, వట్‌పల్లిలో 41.1 డిగ్రీలు, రామచంద్రాపురంలో 41.1 డిగ్రీలు, నిజాంపేట్‌లో 41 డిగ్రీలు, అమీన్‌పూర్‌లో 40.7 డిగ్రీలు, హత్నూరలో 40.6 డిగ్రీలు, పుల్కల్‌లో 40.5 డిగ్రీలు, నాగల్‌గిద్దలో 40.4 డిగ్రీలు, పటాన్‌చెరులో 40.4 డిగ్రీలు, గుమ్మడిదలలో 40.1 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

జీవితాంతం ప్రజాసేవలోనే ఉంటా

- గంగా, జమున, తహీజిబ్‌కు సిద్దిపేట కేంద్ర బిందువు
- అధికారంలో ఉన్నా లేకున్నా నిరంతరం ప్రజల కోసమే పని చేస్తాం
- మాజీమంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు

సిద్దిపేటటౌన్, ఏప్రిల్ 7: జీవితాంతం ప్రజాసేవలోనే ఉంటానని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు స్పష్టం చేశారు. ఆదివారం సిద్దిపేటలోని ఓ గార్డెన్‌లో ఏర్పాటు చేసిన దావతే ఇఫ్తార్ విందులో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సిద్దిపేట.. గంగా, జమున, తహజీద్‌కు కేంద్ర బిందువు అన్నారు. నాటి ఎమ్మెల్యేలు మదన్‌మోహన్, కేసీఆర్ కాలం నుంచే ఇక్కడి ప్రజలు సోదరభావంతో కలిసి మెలిసి ఉంటారని చెప్పారు. అన్నిరంగాల్లో సిద్దిపేట ఆదర్శంగా నిలిచిందన్నారు. రాష్ట్రంలోనే తొలిసారిగా ఆఖరి సఫర్ అనే అంతిమ యాత్ర వాహనాన్ని సిద్దిపేటలోనే అందుబాటులోకి తీసుకొచ్చామని చెప్పారు. డెడ్ బాడీలను నిల్వ ఉంచడానికి అన్ని మసీదుల్లో ఫ్రీజర్లను అందుబాటులో ఉంచినట్లు వివరించారు. తన సొంత డబ్బుతో సిద్దిపేట ముస్లింల కోసం ఎన్సాన్‌పల్లిలో మూడెకరాల భూమిని కొనిచ్చి, బోరు వేసి చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. నేడు ఆ భూమికి కోట్ల విలువ వచ్చిందన్నారు. అధికారంలో ఉన్నా లేకున్నా నిరంతరం ప్రజల కోసమే పనిచేస్తామన్నారు. నిరుపేద ముస్లిం మహిళలు ఉపాధి పొందాలనే లక్ష్యంతో తన సొంతంగా కుట్టుమిషన్లను అందజేసినట్లు చెప్పారు. ఏటా పదిమంది నిరుపేదలకు ఉమ్రయాత్రను పంపిస్తున్నానని తెలిపారు. బతికున్నంత కాలం ప్రతీ ఏడాది పంపిస్తూనే ఉంటానన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోనే హైదరాబాద్ తర్వాత మొట్టమొదటి హజ్ హౌస్ నిర్మాణం సిద్దిపేటలోనే చేసుకున్నామని హరీశ్‌రావు పేర్కొన్నారు. ఎండ తీవ్రత ఎక్కువ ఉండడంతో పండుగ రోజున నమాజ్‌వేళలో ప్రజలకు ఇబ్బంది కలగకుండా సిద్దిపేట మున్సిపాల్ పాలకవర్గం సహకారంతో పూర్తి సదుపాయాలను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఇఫ్తార్ విందులో మెదక్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి వెంకట్రామారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ ఫారుక్ హుస్సేన్, తంజిం ప్రతినిధులు, ముస్లిం మత పెద్దలు అబ్దుల్ సమీ, ఆసిఫ్, అబ్దుల్ వహీద్, జావీద్, తహెర్, ప్రజా ప్రతినిధులు, నాయకులు కడవేర్గు రాజనర్సు, వేలేటి రాధాకృష్ణశర్మ, గుండు భూపేష్, పాల సాయిరాం, మచ్చ వేణుగోపాల్‌రెడ్డి, వజీరుద్దీన్, ఫక్రుద్దీన్, మోయిజ్, కౌన్సిలర్లు నాగరాజురెడ్డి, మల్లికార్జున్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీమంత్రి, సిద్ది పేట ఎమ్మెల్యే హరీశ్‌రావు



భక్తులతో కిక్కిరిసిన గంగిరేగుచెట్టు ప్రాంగణం

చివరివారం కొమురవెల్లి కిటకిట

- అగ్నిగుండాలకు భారీగా తరలివచ్చిన భక్తులు
- మల్లన్న నామస్మరణతో పులకించిన ఆలయ పరిసరాలు

5లో



బోనం తీసుకెళ్తున్న భక్తులు



గువ్వల గొంతుతడిసేలా..

- చెట్ల మధ్యలో పక్షుల కోసం నీటి తొట్లు ఏర్పాటు
- సిద్దిపేట మున్సిపల్ అధికారుల వినూత్న ఆలోచన

సిద్దిపేటటౌన్, ఏప్రిల్7: ఈ ఎండలకు బయటకు వెళ్లాలంటేనే ప్రజలు జంకుతున్నారు. వేడి నుంచి ఉపశమనం పొందేందుకు చల్లనినీరు, కొబ్బరిబోండాలు, శీతల పానియాలను ఆశ్రయిస్తున్నారు. ఇక పశువులు, పక్షుల పరిస్థితి మరీ దారుణంగా ఉంది. కొన్ని సందర్భాల్లో నీరు దొరక్క అవి ప్రాణాలు కోల్పోతున్నాయి. పక్షులకు ఎప్పుడూ నీరు అందుబాటులో ఉండేలా సిద్దిపేట మున్సిపల్ కమిషనర్ ప్రసన్నరాణి, హరితహారం ప్రత్యేకాధికారి ఐలయ్య వినూత్నంగా ఆలోచించారు. పట్టణంలోని ఇరువైపులా నాటిన చెట్లు, డివైడర్లపై ఉన్న చెట్లకు ప్లాస్టిక్ డబ్బాలను ఏర్పాటు చేసి వాటిలో ప్రతిరోజూ నీరు పోస్తున్నారు. ముందుగా సిద్దిపేటలోని హైదరాబాద్ రోడ్డు మార్గాన దాదాపు 40 నీటితొట్లను ఏర్పాటు చేశారు.









మెదక్ సీఎస్ఐ చర్చి ఆదివారం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. బిషప్ పద్మారావు ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రార్థనల్లో వేలాదిగా ప్రజలు పాల్గొన్నారు. ప్రార్థనల అనంతరం భక్తులు చర్చి ఆవరణలోని చెట్ల కింద సేదదీరారు. అక్కడే వంటలు చేసుకుని విందు చేసుకున్నారు.

\-మెదక్ కల్చరల్







భక్తి మార్గంతోనే మానసిక ప్రశాంతత

● కేదార్‌నాథ్ ఆలయ ప్రధాన అర్చకుడు శివలింగ్‌స్వామి


వెల్దుర్తి, ఏప్రిల్ 7 : భక్తి మార్గంతోనే మానసిక ప్రశాంతత కలుగుతుందని కేదార్‌నాథ్ ఆలయ ప్రధాన అర్చకులు శివలింగ్‌స్వామి అన్నారు. ఆదివారం మండల పరిధిలోని బస్వాపూర్ శ్రీభ్రమరాంబ మల్లికార్జునస్వామి ఆలయంలో ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధ్యాత్మిక చింతనతో, భక్తి మార్గంతోనే మోక్ష ప్రాప్తి కలుగుతుందన్నారు. ప్రతి ఒక్కరూ భక్తి భావం అలవర్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.


కోలపల్లి టోల్‌ప్లాజా వద్ద రూ.1.45 లక్షలు పట్టివేత


పెద్దశంకరంపేట ఏప్రిల్ 7: పెద్దశంకరంపేట మండల పరిధిలోని 161వ జాతీయ రహదారి కోలపల్లి టోల్‌ప్లాజా వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టులో ఆదివారం పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. మహారాష్ట్ర నుంచి శంకరంపేట మీదుగా వెళ్తున్న అనిల్ కాంబ్లీ వాహనంలో రూ.1.45 లక్షల నగదును పట్టుకున్నట్లు ఎస్‌ఐ శంకర్ తెలిపారు. ఎలాంటి ధ్రువపత్రాలు లేకుండా డబ్బు తీసుకెళుతుండడంతో స్వాధీనం చేసుకొని ఉన్నతాధికారులకు అప్పగించినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.











బ్రాహ్మణకుంటలో ఈతకు వెళ్లి బాలుడి మృతి


బాలుడి మృతదేహం వద్ద రోదిస్తున్న తల్లిదండ్రులు

జగదేవ్‌పూర్, ఏప్రిల్ 7: ఈతకు వెళ్లి నీట మునిగి బాలుడు మృతిచెందిన ఘటన సిద్దిపేట జిల్లా జగదేవ్‌పూర్ మండలం తీగుల్ గ్రామంలో చోటుచేసుకున్నది. జగదేవ్‌పూర్ ఎస్ఐ చంద్రమోహన్ తెలిపిన వివరాలు ప్రకారం.. బీహార్‌కు చెందిన కుశలం మస్తాన్ దంపతులకు ఇద్దరు కుమారులు. బతుకుదెరువు కోసం గతేడాది తీగుల్ గ్రామానికి వచ్చి ఇనుప సామగ్రి దుకాణంలో పనిచేస్తున్నాడు. వారి కుమారులు రేషన్ నాట్, అబీబుల్లా నాట్ మరో బాలుడుతో కలిసి శనివారం దగ్గరలోని బ్రాహ్మణకుంటలోకి స్నానం కోసం వెళ్లారు. ఈ క్రమంలో రేషన్ నాట్(9) బాలుడు కుంటలో మునిగిపోయారు. తల్లిదండ్రులు శనివారం సాయంత్రం కుంటలో వెతికినా ఆచూకీ లభించలేదు. ఆదివారం ఉదయం కుంటలో శవం తేలడంతో బయటకు తీశారు. ఘటనా స్థలానికి పోలీసులు చేరుకొని మృతికి గల కారణాలు తెలుసుకొని పోస్టుమార్టం నిమిత్తం గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

లొద్దిచెరువులో ఈతకు వెళ్లి ఒకరి గల్లంతు

దుబ్బాక, ఏప్రిల్ 7: చెరువులో ఈతకు వెళ్లిన ఒకరు నీటమునిగి గల్లంతైన సంఘటన ఆదివారం దుబ్బాక మండల పరిధిలో చోటుచేసుకున్నది. దుబ్బాక ఎస్ఐ గంగరాజు తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దగుండవెల్లి గ్రామానికి చెందిన అస్కల దేవానందం(42) ఆదివారం అప్పనపల్లి శివారులోని లొద్దిచెరువులో ఈతకు వెళ్లాడు. తిరిగి ఇంటికి రాకపోవడంతో స్థానికులు వెంటనే దుబ్బాక పోలీసులకు సమాచారం అందించారు. చెరువులో గాలించిన ఆదివారం రాత్రి వరకు ఆచూకీ లభించలేదు.

వరి కుప్పను ఢీకొని ఒకరి మృతి

వెల్దుర్తి, ఏప్రిల్7 : వరి కుప్పను ఢీకొని ఒకరు మృతిచెందిన సంఘటన మండల పరిధిలోని కుకునూర్ గ్రామంలో ఆదివారం రాత్రి చోటు చేసుకున్నది. స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం.. వెల్దుర్తి మండలంలోని మనేపల్లి గ్రామానికి చెందిన దుబాషి రఘుపతి(45) పని నిమిత్తం ద్విచక్ర వాహనంపై వెల్దుర్తికి వచ్చి తిరిగి గ్రామానికి వెళ్తున్న క్రమంలో కుకునూర్ గ్రామం వద్ద రోడ్డుపై ఆరబోసిన వరి ధాన్యం కుప్పను ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తూప్రాన్ ప్రభుత్వం ఆసుపత్రికి తరలించి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నవత తెలిపారు.

బోరు వాహనం కిందపడి ఒకరి మృతి


మడ్డ కుర్మయ్య మృతదేహం

నర్సాపూర్, ఏప్రిల్ 7: నర్సాపూర్ పట్టణంలో జరిగిన రోడ్డుప్రమాదంలో ఒకరు మృతిచెందిన సంఘటన ఆదివారం చోటుచుసుకున్నది. ఎస్ఐ పుష్పరాజ్ తెలిపిన వివరాల ప్రకారం.. నాగర్‌కర్నూల్ జిల్లాకు చెందిన మడ్డ కుర్మయ్య(45) హత్నూర మండలం సుగుణ హేచరీస్ సంస్థలో పని చేస్తూ నర్సాపూర్‌లో అద్దెకు ఉంటున్నాడు. ఆదివారం సాయంత్రం నర్సాపూర్ - సంగారెడ్డి ప్రధాన రహదారిలో హెచ్‌పీ పెట్రోల్‌బంక్ వద్ద ప్రమాదవశాత్తు బోరు వాహనం వెనక టైర్ల కింద పడడంతో శరీర భాగాలు రెండుగా విడిపోయి మృతిచెందాడు. మృతదేహాన్ని ఎస్ఐ పుష్పరాజ్ పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

చిన్నకోడూరు, ఏప్రిల్ 7 : రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీ కొనడంతో ఇద్దరికి తీవ్రగాయాలైన సంఘటన చిన్నకోడూరు మండలం పెద్దకోడూరు శివారులోని మెట్టుబండల వద్ద ఆదివారం చోటుచేసుకున్నది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దకోడూరు గ్రామానికి చెందిన బోనాల మహేశ్ బైక్ మీద సిద్దిపేట నుంచి స్వగ్రామానికి వస్తున్నాడు. ఈ క్రమంలో సిద్దిపేట మున్సిపల్ పరిధిలోని లింగారెడ్డిపల్లికి చెందిన పోతుల నాగరాజు బైక్‌పై ఎదురుగా వచ్చి మహేశ్ బైక్‌ను ఢీ కొట్టాడు. కిందపడిన ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. 108 అంబులెన్స్ సంఘటనా స్థలానికి చేరుకోని క్షతగాత్రులకు ప్రథమ చికిత్స అందించారు. అనంతరం వారిని సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్ఐ బాలకృష్ణ తెలిపారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య


చిక్కుడు శ్రీనివాస్(ఫైల్)

మిరుదొడ్డి, ఏప్రిల్ 7 : ఎన్నో ఆశలతో చేస్తున్న వ్యవసాయం అప్పులు మిగల్చడంతో జీవితంపై విరక్తి చెందిన ఓ రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన సిద్దిపేట జిల్లా మిరుదొడ్డి మండలం కాసులాబాద్ గ్రామంలో చోటుచేసుకున్నది. మిరుదొడ్డి ఎస్ఐ పర్శరామ్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రమైన తొగుట గ్రామానికి చెందిన చిక్కుడు శ్రీనివాస్(45)కు మల్లన్నసాగర్ ప్రాజెక్ట్ నిర్మాణంలో భూమిని కోల్పోయాడు. దీంతో మిరుదొడ్డి మండలం కాసులాబాద్ గ్రామంలో ఐదెకరాల భూమిని కొనుగోలు చేసి వ్యవసాయం చేస్తున్నాడు. అప్పులు అధికం కావడంతో శనివారం సాయంత్రం పొలం వద్ద పురుగుల మందును తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డాడు. స్థానిక రైతులు గమనించి కుటుంబసభ్యులకు, 108 అంబులెన్స్‌కు సమాచారం అందించడంతో సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో ఆదివారం మృతిచెందాడు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తును చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

కుటుంబ కలహాలతో యువకుడి ఆత్మహత్య


సుంచు సుధాకర్ (ఫైల్)

చేగుంట, ఏప్రిల్ 7: కుటుంబ కలహాలతో యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన చేగుంట మండలం పరిధిలో ఆదివారం చోటుచేసుకున్నది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. చిన్నశివనూర్ గ్రామానికి చెందిన సుంచు సుధాకర్(30)కు సంవత్సరం క్రితం మాసాయిపేట మండలం చెట్లతిమ్మాయిపల్లికి చెందిన ఎలీశాతో వివాహమైంది. ప్రస్తుతం సుధాకర్ భార్య ఎనిమిది నెలల గర్భిణి కాగా పుట్టింటికి వెళ్లిపోయింది. అయితే సుధాకర్ ఇంట్లో తరచూ గొడవలు కావడంతో జీవితంపై విరక్తి చెంది ఇంట్లో ఎవరూ లేని సమయంలో దూలానికి ఉరేసుకున్నారు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా ఆస్పత్రికి తరలించారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు చేగుంట ఎస్ఐ బాలరాజ్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

చివరివారం కొమురవెల్లి కిటకిట


ఆలయ రాజగోపుర ఆవరణలో భక్తుల రద్దీ

- అగ్నిగుండాలకు భారీగా తరలివచ్చిన భక్తులు
- నలుదిక్కులా జనసందోహం
- ఉచిత, ప్రత్యేక దర్శన క్యూలైన్లు ఫుల్
- గంటల తరబడి పడిగాపులు
- మల్లన్న నామస్మరణతో పులకింత

చేర్యాల, ఏప్రిల్ 7 : కొమురవెల్లి మల్లన్న ఆలయం వేలాదిమంది భక్తులతో జనసంద్రమైంది. మూడునెలల జాతరలో భాగంగా ఆదివారం చివరివారం కావడంతో పాటు అగ్నిగుండాలను తిలకించేందుకు భక్తులు భారీగా తరలివచ్చారు. తలనీలాలు సమర్పించి ఆలయ కోనేటిలో స్నానమాచరించారు. భక్తి ప్రపత్తులతో పట్నాలు వేసి మొక్కులు తీర్చుకున్నారు. మల్లన్నను దర్శించుకుని ఒడిబియ్యాలు పోసి వేడుకున్నారు. ఎల్లమ్మదేవతకు బోనం నివేదించి, కల్లు, బెల్లం పానకం సాకపెట్టి ఒడిబియ్యాలు పోశారు. ప్రత్యేక, ఉచిత ధర్మదర్శనం క్యూలైన్లన్నీ కిక్కిరిసిపోయాయి. దీంతో స్వామివారి దర్శనానికి గంటల తరబడిగా క్యూలైన్లలో పడిగాపులు కాసి తీవ్ర ఇబ్బందులుపడ్డారు. అలాగే పట్నాలు వేసిన భక్తులతో ముఖమండపం, గంగిరేగుచెట్టు ఆలయ ప్రాంగణాలు రద్దీగా మారాయి. తమ కోరికలు నెరవేర్చమని వేడుకుంటూ ఆలయ ప్రాంగణంలోని గంగిరేగుచెట్టుకు భక్తులు ముడుపులు కట్టారు.

ఘనంగా ప్రారంభమైన అగ్నిగుండాలు

జాతరలో చివరిఘట్టమైన అగ్నిగుండాల ఉత్సవాలను ఆలయవర్గాలు ఘనంగా ప్రారంభించాయి. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు జరిపారు. వీరశైవుల జగద్గురు వికారాబాదు జిల్లా ఆలంపల్లి మండలం కెంపినమఠాధీశ్వరుడు చెన్నబసవ ప్రభుమహాస్వామి కొమురవెల్లికి చేరుకున్నారు. ఆయన పర్యవేక్షణలో సాయంత్రం ఆలయావరణలోని తోట బావి ప్రాంగణంలో వీరభద్ర పళ్లెరం, భద్రకాళి పూజలు నిర్వహించగా అర్ధరాత్రి అగ్నిగుండాలను నిర్వహించేందుకు చర్యలు తీసుకున్నారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ ఈవో బాలాజీశర్మ, పునరుద్ధరణ కమిటీ చైర్మన్ పర్పాటకం లక్ష్మారెడ్డి, ధర్మకర్తలు లింగంపల్లి శ్రీనివాస్ తదితరులు ఏర్పాట్లు పర్యవేక్షించారు. హుస్నాబాద్ ఏసీపీ సతీశ్, చేర్యాల సీఐ శ్రీను, కొమురవెల్లి ఎస్ఐ నాగరాజు బందోబస్తు నిర్వహించారు.



మల్లన్నను దర్శించుకున్న ప్రముఖులు

జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ తక్కళ్లపల్లి రాజేశ్వర్ రావు, నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి సతీమణి తదితరులు కుటుంబసమేతంగా ఆదివారం మల్లన్నను దర్శించుకున్నారు. అభిషేకం నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. అర్చకులు స్వామివారి ప్రసాదం అందించి ఆశీర్వదించారు.

అపరిశుభ్ర పరిసరాలతో భక్తుల ఇబ్బందులు

ఆలయ రాజగోపురం లోపల ఆవరణలో అపరిశుభ్రతగా ఉండటంతో భక్తులు తీవ్ర ఇబ్బందులుపడ్డారు. క్యూలైన్‌తో పాటు పట్నాలు వేసే ప్రదేశంలో నీరు ప్రవహించింది. పట్నానికి వినియోగించే పంచరంగుల పొడితో చిత్తడిగా మారడంతో క్యూలైన్‌లో నిలుచున్న భక్తులతో పాటు పట్నాలు వేయడానికి కూర్చోలేక భక్తులు తంటాలు పడ్డారు.




పట్నంవేసి మొక్కులు తీర్చుకుంటున్న భక్తులు, బోనంతో శిగాలూగుతున్న ఆచారవతులు, రాజగోపురం లోపల అపరిశుభ్రంగా పరిసరాలు

మామ, అల్లుడిని ఇంటికి పంపే వరకు వదిలిపెట్టా

- సిద్దిపేటలో సరైనోళ్లు పోటీ చేస్తే సరే..
- లేకపోతే వచ్చే ఎన్నికల్లో నేనే బరిలో నిలబడతా
- గజ్వేల్‌లో నీలం మధుకు ఒక్క ఓటన్న ఎక్కువ రావాలి
- మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు

గజ్వేల్, ఏప్రిల్ 7: మామ, అల్లుడిని ఇంటికి పంపించే వరకు వదిలిపెట్టనని మల్కాజ్‌గిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు అన్నారు. సిద్దిపేట జిల్లా గజ్వేల్‌లో కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి నీలం మధు, డీసీసీ ప్రెసిడెంట్, గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డితో కలసి ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎలాంటి మచ్చ లేని వ్యక్తి నీలం మధును మెదక్ ఎంపీగా బరిలో నిలిపామని, ఆయనకు గజ్వేల్ అసెంబ్లీ నియోజకవర్గంలో ఒక్క ఓటు మెజారిటీ అయినా ఇవ్వాలని ప్రజలను కోరారు. గజ్వేల్ ఎమ్మెల్యేగా గెలిపిస్తే కనీసం ప్రజలను కేసీఆర్ కలువడం లేదని మండిపడ్డారు. సిద్దిపేటపై ఫోకస్ పెట్టానని వచ్చే ఎన్నికల్లో అక్కడ సరైన వ్యక్తి దొరికితే సరే కానీ, దొరకని పక్షంలో తానే సిద్దిపేట బరిలో నిలుస్తానని స్పష్టం చేశారు. మామ, అల్లుడిని గద్దె దించే వరకు వదిలిపెట్టబోనన్నారు. తన మైనంపల్లి సోషల్ సర్వీసెస్‌తో పాటు నర్సారెడ్డి త్వరలోనే ట్రస్ట్ ఏర్పాటు చేయబోతున్నారని, రెండు ట్రస్ట్‌లతో ప్రజాసేవ చేస్తామన్నారు. నర్సారెడ్డి కూతురు ఆంక్షారెడ్డిని ఎమ్మెల్యేను చేస్తానని, తిరుమల వెంకన్న అనుమతితో ఈ మాట ఇస్తున్నానన్నారు. అటు అల్లుడిని, ఇటు మామను గద్దె దించుతానని, మహిళల ప్రాతినిధ్య రాజకీయాల్లో అవసరమన్నారు. నీలం మధుకు మంచి మెజారిటీ ఇవ్వాలని కోరారు. ఈ నెల 12 నుంచి ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభిస్తామని, మల్కాజ్‌గిరితో పాటు మెదక్ సీటుకు తాను ప్రచారం చేస్తానని ఆయన చెప్పారు.


గజ్వేల్ మదీనా మసీద్‌లో మైనంపల్లి హనుమంతరావు, నీలం మధు, నర్సారెడ్డి

అన్ని వర్గాలకు అండగా ఉంటా : నీలం మధు

మెదక్ పార్లమెంట్ పరిధిలోని అన్ని వర్గాల ప్రజలకు అండగా ఉంటానని కాంగ్రెస్ పార్టీ మెదక్ ఎంపీ అభ్యర్థి నీలం మధు పేర్కొన్నారు. మెదక్ పార్లమెంట్ పరిధిలోని అన్ని నియోజకవర్గాల ఇన్‌చార్జిలు, మెదక్ ఎమ్మెల్యే సహకారంతో పార్టీ జెండాను ఎగురవేస్తామని నీలం మధు ధీమా వ్యక్తం చేశారు. రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆరు గ్యారంటీలను అమలు చేస్తున్నామని, అన్ని వర్గాలకు మంచి చేసేలా కాంగ్రెస్ మేనిఫెస్టో ఉందన్నారు. ఎంపీగా గెలిపిస్తే గజ్వేల్‌కు నిదులు సాధిస్తానని, ఇక్కడి ప్రజలకు అండగా ఉంటానన్నారు. అనంతరం నర్సారెడ్డి మాట్లాడుతూ మైనారిటీలకు సబ్‌ప్లాన్‌ను ఏర్పాటు చేస్తామని, రూ.4వేల కోట్లతో నిధులను ఏర్పాటు చేస్తామని ప్రకటించిన కాంగ్రెస్ పార్టీకి మైనారిటీలు అండగా ఉండాలని కోరారు. సమావేశంలో మానకొండూరు మాజీ ఎమ్మెల్యే ఆరేపల్లి మోహన్, ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్ ఎంఏ ఫయీం, ఐఎన్‌టీయూసీ అధ్యక్షుడు నర్సింహారెడ్డి, యూత్ కాంగ్రెస్ అధ్యక్షురాలు ఆంక్షారెడ్డి, టీపీసీసీ నాయకులు సుల్తాన్, నాయకులు మజహర్ మాలిక్, ప్రమోద్‌కుమార్, వంటేరు నరేందర్‌రెడ్డి, సర్దార్‌ఖాన్, తదితరులున్నారు. గజ్వేల్ పట్టణంలోని మదీనా మసీద్‌లో తూంకుంట నర్సారెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో మైనంపల్లి హనుమంతరావు, నీలం మధు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ వచ్చింది.. కరెంట్ కష్టాలు తెచ్చింది

- బీఆర్ఎస్ మెదక్ ఎంపీ అభ్యర్థి, ఎమ్మెల్సీ వెంకట్రామారెడ్డి

నంగునూరు, ఏప్రిల్ 7: గత బీఆర్ఎస్ తొమ్మిదేళ్ల పాలనలో పోని కరెంట్ ఇప్పుడే ఎందుకు పోతుందని బీఆర్ఎస్ మెదక్ ఎంపీ అభ్యర్థి, ఎమ్మెల్సీ వెంకట్రామారెడ్డి ప్రశ్నించారు. కాంగ్రెస్ వచ్చింది, కరెంట్ కష్టాలు తెచ్చిందని మండిపడ్డారు. ఆదివారం మండలంలోని సిద్దన్నపేటలో ఓ ఫంక్షన్‌హాలులో పార్టీ మండల అధ్యక్షుడు అనగోని లింగంగౌడ్ అధ్యక్షతన నిర్వహించిన బీఆర్ఎస్ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కరెంటు కష్టాలు పోవాలంటే మళ్లీ కేసీఆర్ పాలన రావాలన్నారు. ఆచరణ సాధ్యం కానీ హామీలను ఇచ్చి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందన్నారు. నాడు పక్క రాష్ట్రం వాళ్లు తెలంగాణకు అన్యాయం చేస్తే, నేడు సొంత రాష్ట్రం కాంగ్రెస్ నాయకులే అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. తనను గెలిపిస్తే రూ.100 కోట్లతో వీపీఆర్ ట్రస్ట్ ఏర్పాటు చేసి పేదలు, నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జడ్పీటీసీ తడిసిన ఉమా, నాయకులు జాప శ్రీకాంత్‌రెడ్డి, ఎడ్ల సోమిరెడ్డి, కోల రమేశ్ గౌడ్, ఎంపీటీసీలు, మాజీ సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న వెంకట్రామారెడ్డి

రాష్ట్ర అభివృద్ధి బీఆర్ఎస్‌తోనే సాధ్యం

- అన్నివర్గాల అభ్యున్నతికి కేసీఆర్ చేసిన కృషి అమోఘం
- హోంశాఖ మాజీ మంత్రి మహమూద్ అలీ

జహీరాబాద్, ఏప్రిల్ 7 : రాష్ట్ర అభివృద్ధి బీఆర్ఎస్‌తోనే సాధ్యమైతుందని హోంశాఖ మాజీ మంత్రి మహమూద్ అలీ పేర్కొన్నారు. ఆదివారం జహీరాబాద్ పట్టణంలో టీఎస్ఐడీసీ మాజీ చైర్మన్ మహ్మద్ తన్వీర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. దివంగత నేత, మాజీ ముఖ్యమంత్రి ఎన్‌టీరామారావు ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందుల కార్యక్రమం ఏర్పాటు జరిగిందన్నారు. అదే ఆనవాయితీని బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కొనసాగిస్తూ వచ్చారని ఆయన గుర్తుచేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రాష్ట్రం గంగాజమున తహజీబ్ తరహాలో వర్ధిల్లిందని ఆయన చెప్పారు. అన్నివర్గాల అభ్యున్నతికి కేసీఆర్ చేసిన కృషి అమోఘమన్నారు. జహీరాబాద్ పార్లమెంట్ అభ్యర్థిగా పోటీచేస్తున్న గాలి అనిల్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జహీరాబాద్ ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు, డీసీఎంఎస్ చైర్మన్ మల్కాపురం శివకుమార్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు దేవిప్రసాద్, ఎస్సీ కార్పోరేషన్ అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ నరోత్తం, నాయకులు జైపాల్‌రెడ్డి, ఆయా మండలాలకు చెందిన పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.


ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే మాణిక్‌రావుకు పండు తినిపిస్తున్న మాజీ మంత్రి మహమూద్ అలీ

ఇఫ్తార్ విందుకు హాజరైన ఇఫ్కో డైరెక్టర్

రామాయంపేట, ఏప్రిల్ 7 : రామాయంపేట పట్టణంలో ఆదివారం సాయంత్రం నిర్వహించిన ఇఫ్తార్ విందులో ఇఫ్కో డైరెక్టర్ దేవెందర్‌రెడ్డి పాల్గొన్నారు. ఆయనతో పాటు మున్సిపల్ చైర్మన్ జితేందర్‌గౌడ్, కౌన్సిలర్లు నాగరాజు, బీఆర్ఎస్ నేతలు హాజరయ్యారు.

బీజేపీ విధానాలపై త్వరలో సెమినార్ ఏర్పాటు

గజ్వేల్ ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలతో ప్రొఫెసర్ కోదండరాం

గజ్వేల్, ఏప్రిల్ 7: బీజేపీ విధానాలపై త్వరలోనే సెమినార్ ఏర్పాటు చేద్దామని ప్రొఫెసర్ కోదండరాం అన్నారు. అనారోగ్యానికి గురైన గజ్వేల్ పట్టణానికి చెందిన తెలంగాణ జన సమితి జిల్లా అధ్యక్షుడు నిరుడి స్వామిని ఆదివారం ఆయనను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలో హైదరాబాద్‌లో సెమినార్ ఏర్పాటు చేసి, బీజేపీ విధానాలను ఎండగడదామని ఉద్యోగ, ఉపాధ్యాయులతో అన్నారు. తప్పకుండా రావాలని, ఆ పార్టీ చేపడుతున్న ప్రజా, రైతాంగ వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. ఆయన వెంట టీపీటీఎఫ్ పూర్వ అధ్యక్షుడు ఏడెల్లి రామచంద్రం, ఉపాధ్యాయ సంఘ నాయకులు బి.రాజులు, సత్తయ్య, మల్లేశం, ఎంఎస్‌పీ నాయకులు మైస రాములు, వార్డు కౌన్సిలర్ బొగ్గుల చందు, సత్యనారాయణ తదితరులున్నారు.


నిరుడి స్వామిని పరామర్శిస్తున్న కోదండరాం

300 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత


రామాయంపేటలో పట్టుబడిన రేషన్ బియ్యం లారీని చూపుతున్న ఎస్ఐ రంజిత్

రామాయంపేట, ఏప్రిల్ 7 : అక్రమంగా లారీలో తరలిస్తున్న 300 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పోలీసులు ఆదివారం పట్టుకున్నారు. హైదరాబాద్ శివారులో లారీలో బియ్యం లోడ్ చేసుకుని గుజరాత్ ప్రాంతానికి తరలిస్తున్నట్లు డ్రైవర్ చెప్పాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మూడు రోజుల క్రితం పట్టణ శివారులోనూ బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తున్న 16 క్వింటాళ్ల బియ్యాన్ని పోలీసులు పట్టుకున్న విషయం తెలిసిందే.

ఊడలమర్రి నల్లపోచమ్మతల్లి జాతరకు ఏర్పాట్లు

చిన్నశంకరంపేట, ఏప్రిల్ 7: చిన్నశంకరంపేట మండలంలోని జంగరాయి గ్రామంలోని ఊడలమర్రి నల్లపోచమ్మతల్లి జాతరకు ఏర్పాట్లు పూర్తిచేసినట్లు ఆలయాభివృద్ధి కమిటీ చైర్మన్ శ్రీనివాస్ తెలిపారు. సుమారు 200 ఏళ్లకుపైబడిన భారీ ఊడల మర్రిచెట్టు కింద నల్లపోచమ్మ అమ్మవారు, ముత్యాలమ్మ కొలువై ఉన్నారు. ఉగాది సందర్భంగా జంగరాయి ఆలయాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 9 నుంచి జాతర నిర్వహించనున్నారు. మూడు రోజులపాటు కొనసాగనున్నది.


జంగరాయిలో భారీ ఊడల మర్రిచెట్టు, కొలువైన నల్లపోచమ్మతల్లి

రేపటి నుంచి మత్తడిపోచమ్మ జాతర

నారాయణఖేడ్, ఏప్రిల్ 7: ఖేడ్ జంట గ్రామమైన మంగల్‌పేటలో మంగళవారం నుంచి 11వరకు మత్తడి పోచమ్మ, దుర్గాభవానీ అమ్మవార్ల వార్షిక మహోత్సవ జాతర ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ అభివృద్ధి కమిటీ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపింది. మంగళవారం ఉగాది పర్వదినం సందర్భంగా అమ్మవారికి బోనాలు, 10న బండ్ల ప్రదర్శన, 11న కుస్తిపోటీలు, అన్న ప్రసాద వితరణ తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

దుర్గమ్మతల్లికి అంగరంగ వైభవంగా బోనాలు



పెద్దశంకరంపేట, ఏప్రిల్ 7 : పెద్దశంకరంపేటలోని దుర్గమ్మతల్లి అమ్మవారికి ఆదివారం సాయంత్రం వైభవంగా బోనాలను సమర్పించారు. సరస్వతీ శిశు మందిర్ నుంచి పట్టణ పురవీధుల గుండా డప్పుచప్పుళ్లతో బోనాల ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ జంగం శ్రీనివాస్, ఎంపీటీసీ వీణసుభాష్ గౌడ్, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

పెద్దశంకరంపేటలో దుర్గమ్మతల్లి బోనాల ఊరేగింపు

ఉత్సాహంగా మడ్ బాత్

సిద్దిపేట టౌన్, ఏప్రిల్ 7: సిద్దిపేట పట్టణంలోని ఆదివారం నిర్వహించిన సామూహిక మట్టి స్నానం(మడ్ బాత్) కార్యక్రమంలో యోగా సాధకులు, ఆరోగ్యభిలాషులు పాల్గొని మురిసిపోయారు. వ్యాస మహర్షి యోగ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో వివిధ యోగా, ఉద్యోగ, ఆధ్యాత్మిక, స్వచ్ఛంద, వ్యాపార సంఘాల ప్రతినిధులు ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రముఖ వైద్యుడు డాక్టర్ బిఎన్.స్వామి మాట్లాడుతూ మట్టి స్నానంతో వివిధ రకాల వ్యాధులను దూరం చేసే అవకాశం ఉందని చెప్పారు. తెలంగాణ రాష్ట్ర యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ జాయింట్ సెక్రెటరీ యోగా రామిరెడ్డి మాట్లాడుతూ ప్రాచీన కాలం నుంచి వస్తున్న సంప్రదాయాలు, జీవన శైలి రోగాలకు దూరంగా ఉంచుతాయన్నారు. ప్రముఖ యోగ శిక్షకుడు తోట సతీష్ ఆధ్వర్యంలో మట్టి లేపనంతో యోగా సాధన చేశారు. ఈ కార్యక్రమంలో వ్యాస మహర్షి యోగా సొసైటీ అధ్యక్షుడు నిమ్మ శ్రీనివాస్‌రెడ్డి, సిద్దిపేట జిల్లా యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు తోట అశోక్, గౌరవాధ్యక్షుడు అంజయ్య తదితరులు పాల్గొన్నారు.


సిద్దిపేట పట్టణంలో మడ్ బాత్ కార్యక్రమంలో పాల్గొన్న యోగా సాధకులు

నివాసాల మధ్య మురుగునీటి గుంత

● వ్యాధులబారిన శ్రీనివాసనగర్ కాలనీవాసులు

సిద్దిపేట టౌన్, ఏప్రిల్7: సిద్దిపేట పట్టణంలోని శ్రీనివాసనగర్ కాలనీలో కొన్ని నెలలుగా అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నుంచి లీకైన మురుగునీరు చేరి నివాసాల మధ్యన కుంటలాగా మారినా మున్సిపల్ అధికారులకు పట్టడం లేదని కాలనీవాసులు వాపోతున్నారు. ఈ విషయమై అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదని, గత వారం రోజుల నుంచి కాలనీకి చెందిన పలువురు విషజ్వరాలతో ఆసుపత్రిలో చేరారని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మురుగునీటితో పరిసరాల్లో దుర్గంధం వ్యాపించడమే కాకుండా దోమల బెడద ఎక్కువైందని పలువురు అసంతృప్తి వ్యక్తం చేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ మంజులరాజనర్సు, కౌన్సిలర్లు, అధికారులు చొరవ తీసుకొని తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేకపోతే కాలనీవాసులంతా కలిసి మున్సిపల్ కార్యాలయం ముందు బైఠాయిస్తామని హెచ్చరించారు.



శ్రీనివాసనగర్‌లో ఏర్పడిన మురుగునీటి గుంత

రోడ్డు వేశారు.. జాగ్రత్తలు మరిచారు

● గత నెలలో రూ.30 లక్షలతో రోడ్డు పనులు ● సైడ్ బర్మ్, సూచిక బోర్డులు లేక ఇక్కట్లు ● కాంట్రాక్టర్ నిర్లక్ష్యంపై ఎల్లాయగూడెం గ్రామస్థుల ఆగ్రహం





సైడ్ బర్మ్ వేయకుండానే నిర్మించిన రోడ్డు, మలుపుల వద్ద కనిపించని సూచిక బోర్డులు

కుకునూరుపల్లి, ఏప్రిల్ 7: మండలంలోని ఎల్లాయగూడ గ్రామానికి కొన్నేళ్లుగా గుంతలమయమైన రోడ్డుతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఎట్టకేలకు నెల క్రితం రూ. 30లక్షల వ్యయంతో ఆ గ్రామానికి ఒక కిలోమీటర్ పొడవునా తారు రోడ్డు వేశారు. దీంతో తమ కష్టాలు తీరుతాయని గ్రామస్థులు, వాహనదారులు సంతోషించారు. కానీ కాంట్రాక్టర్ నిర్లక్ష్యం, అధికారుల పట్టింపు లేమితో కొత్త రోడ్డు వేసినా ఇబ్బందులు మాత్రం తొలగలేదు సరికదా ప్రమాదాలకు ఆస్కారం ఏర్పడింది.

సైడ్‌బర్మ్ రిచారు

రూ. లక్షలు వెచ్చించి తారు రోడ్డు వేశారు.. కానీ దానికి పక్కన ఇరువైపులా సైడ్ బర్మ్ వేయలేదు. దీంతో బస్సులు, ట్రాక్టర్లు ఇతర పెద్ద వాహనాలు వచ్చినప్పుడు ఎదురుగా వచ్చే వాహనాలు రోడ్డు దిగాల్సి వస్తుంది. అలాంటప్పుడు వాహనాలు రోడ్డు అంచుల నుంచి జారి ప్రమాదం జరిగే అవకాశం ఉందని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో తమకు ఇబ్బందులు తప్పడం లేదని గ్రామస్థులు వాపోతున్నారు.

సూచిక బోర్డులూ లేవు

కొత్తగా రోడ్డు నిర్మాణం చేపడితే నిబంధనల ప్రకారం ఇరువైపులా సైడ్‌బర్మ్ ఏర్పాటు చేయాలి. దాంతోపాటు మూల మలుపుల వద్ద సూచికలు, గ్రామం ఎన్ని కిలోమీటర్ల దూరంలో ఉందో తెలిపే విధంగా వివరాలు ఉండాలి. అయితే కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో రోడ్డు మాత్రం నిర్మించి ఇతర విషయాలను పట్టించుకోలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కాంట్రాక్టర్‌తో సైడ్‌బర్మ్, సూచిక బోర్డులను ఏర్పాటు చేయించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

కాంట్రాక్టర్‌ను ఆదేశించాం

ఎల్లాయగూడకు వేసిన రోడ్డుకు సైడ్‌బర్మ్, సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించాం. రోడ్డుకు సంబంధించిన బిల్లులు ఇంకా రాలేదు. సైడ్‌బర్మ్, సూచిక బోర్డులు ఏర్పాటు చేసిన తర్వాతనే బిల్లును చెల్లిస్తాం.

- దేవయ్య, పీఆర్ ఏఈ

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి



మద్దూరులో ఐకేపీ కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న నిర్వాహకులు

మద్దూరు, ఏప్రిల్ 7: మద్దూరు మండల కేంద్రంలో క్రాంతి గ్రామైక్య సంఘం ఆధ్వర్యంలో రైతుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు గొట్టి కనకలక్ష్మి, బంటులక్ష్మి తెలిపారు. ఆదివారం మండల కేంద్రంలోని తహసీల్ కార్యాలయం సమీపంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో సీఏ జేబాతబుస్సుమ్, రైతులు షౌకత్‌అలీ, సాయిలు ఆమీద్ పాల్గొన్నారు.

ఉగాది కవి సమ్మేళనాన్ని విజయవంతం చేయండి



గజ్వేల్‌లోని టీపీటీఎఫ్ కార్యాలయంలో ఉగాది కవి సమ్మేళనం కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న టీపీటీఎఫ్ నాయకులు

గజ్వేల్, ఏప్రిల్ 7: టీపీటీఎఫ్ గజ్వేల్ జోన్, సకల జనుల రచయితల సంఘం ఆధ్వర్యంలో క్రోధి నామ సంవత్సర ఉగాది సందర్భంగా గజ్వేల్‌లో నిర్వహించనున్న కవి సమ్మేళన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని టీపీటీఎఫ్ జోన్ కన్వీనర్ సుంచు నరేందర్, సకల జనుల రచయితల సంఘం అధ్యక్షుడు కటుకం రాజయ్య పిలుపునిచ్చారు. గజ్వేల్ పట్టణంలోని టీపీటీఎఫ్ కార్యాలయంలో కవి సమ్మేళనానికి సంబంధించిన కరపత్రాన్ని గజ్వేల్ జోన్ కార్యాలయంలో ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మంగళవారం సాయంత్రం 5గంటలకు టీపీటీఎఫ్ గజ్వేల్ జోన్ కార్యాలయంలో నిర్వహించనున్న ఉగాది కవి సమ్మేళనం కార్యక్రమంలో కవులు, విద్యార్థులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో టీపీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ రాజులు, గజ్వేల్ మండలాధ్యక్షుడు పాపిరెడ్డి, గజ్వేల్, జగదేవ్‌పూర్, దౌల్తాబాద్ మండలాల ప్రధాన కార్యదర్శులు నాగరాజు, సత్తయ్య, యాదయ్య, సీనియర్ నాయకులు ఎల్లయ్య, శ్రీనివాస్, భాస్కర్ పాల్గొన్నారు.

రూ.లక్షలు వెచ్చించారు.. అర్ధాంతరంగా వదిలేశారు

● ఉమ్మడి మండలంలో పిల్లర్ల స్థాయికే పరిమితమైన బస్ షెల్టర్లు

● పనులు పూర్తి కాకుండానే శిథిలావస్థకు చేరిన వైనం





గొల్లపల్లిలో పిల్లర్ల స్థాయిలో నిలిచిపోయిన బస్ షెల్టర్, గజ్వేల్-చేగుంట రహదారిలో నిలిచిపోయిన బస్ షెల్టర్ పనులు

రాయపోల్, ఏప్రిల్ 7: గ్రామీణ ప్రాంతాల ప్రజలు వివిధ గ్రామాలకు వెళ్లేందుకు బస్సులు, ఆటోల కోసం ఒక్కోసారి చాలా సేపు రోడ్లపై ఎదురుచూడాల్సి వస్తుంది. అయితే బస్‌షెల్టర్లు లేక తీవ్ర ఇబ్బందులు తప్పడం లేదు. వారి ఇబ్బందులను తొలగించేందుకు ప్రభుత్వం పలు గ్రామాల్లో బస్సు షెల్టర్ల నిర్మాణాలు చేపట్టింది. ఈ క్రమంలో సుమారు ఆరేళ్ల క్రితం ఉమ్మడి దౌల్తాబాద్ మండలం(ప్రస్తుత రాయపోల్ మండలం) లోని గొల్లపల్లి వద్ద బస్సు షెల్టర్ నిర్మాణం కోసం రూ. 2.50 లక్షలు, గజ్వేల్-చేగుంట రహదారిపై బస్సు షెల్టర్ నిర్మాణం కోసం రూ.3 లక్షలు మంజూరయ్యాయి. కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం, అధికారుల పర్యవేక్షణా లోపంతో ఈ బస్సు షెల్టర్ల నిర్మాణం పిల్లర్ల స్థాయిలోనే నిలిచిపోయాయి. నిర్మించిన పిల్లర్లు సైతం ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. ప్రస్తుత వేసవిలో ఎండలు మండిపోతుండడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అసంపూర్తి బస్‌షెల్టర్ల విషయమై సంబంధిత అధికారులను వివరణ కోరగా.. సదరు పనులు ఉమ్మడి మండలంగా ఉన్న సమయంలో మంజూరయ్యాయని, ఇందుకు సంబంధించిన పూర్తి సమాచారం తమవద్ద లేదని చెబుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ప్రయాణికుల ఇబ్బందులపై దృష్టి సారించి అసంపూర్తిగా ఉన్న బస్ షెల్టర్ల నిర్మాణాన్ని పూర్తి చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



మల్లికార్జునస్వామికి అన్నపూజ

మర్పడగ మల్లికార్జునుడికి అన్నాభిషేకం

కొండపాక, ఏప్రిల్ 7: మండలంలోని మర్పడగ గ్రామంలో శ్రీవిజయదుర్గా సమేత సంతాన మల్లికార్జునస్వామి క్షేత్రంలో ఆదివారం మాసశివరాత్రి సందర్భంగా స్వామివారికి అన్నాభిషేకం నిర్వహించారు. క్షేత్ర నిర్వాహకులు డాక్టర్ చెప్పెల హరినాథశర్మ ఆధ్వర్యంలో ఉదయం ఆరున్నర గంటలకు గణపతి పూజతో కార్యక్రమం ప్రారంభం కాగా విజయదుర్గామాతకు సంతాన మల్లికార్జున స్వామికి విశేష పూజలు నిర్వహించారు. అనంతరం ఉదయం 10 గంటల నుంచి ఒంటి గంట వరకు లఘున్యాస పూర్వకంగా విశేష పంచామృత ఫలరసాభిషేకం నిర్వహించి అన్నపూజ చేశారు. మంగళహారతి మంత్రపుష్పం అనంతరం తీర్థప్రసాద వినియోగం జరిగింది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో క్షేత్ర నిర్వహణాకమిటీ సభ్యులు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో రైతు వ్యతిరేక ప్రభుత్వం



గజ్వేల్‌లో మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

గజ్వేల్, ఏప్రిల్ 7: రాష్ట్రంలో రైతు వ్యతిరేక ప్రభుత్వం ఉందని బీజేపీ గజ్వేల్ పట్టణ అధ్యక్షుడు దేవులపల్లి మనోహర్‌యాదవ్ పేర్కొన్నారు. పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్, కాంగ్రెస్‌లు రైతులపై కపట ప్రేమ చుపిస్తున్నాయన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం గ్యారంటీల పేరుతో గారడీ చేస్తుందని, రైతులకు కాంగ్రెస్ హామీ ఇచ్చిన మేర వెంటనే రూ.2లక్షల రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. రైతులకు పంటనష్టం కింద రూ.20వేల నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. రూ.12వేలు రైతు కూలీల అకౌంట్లో జమచేయాలని, లేని పక్షంలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రజాక్షేత్రంలో నిలదీస్తామని హెచ్చరించారు. ఆయన వెంట బీజేపీ గజ్వేల్ పట్టణ ప్రధాన కార్యదర్శులు కొలుపుల నరేందర్, ఐల మహేందర్, మంద వెంకటేష్, బీజేపీ గజ్వేల్ పట్టణ ఉపాధ్యక్షులు మైస విజయ్, నాయిని సందీప్, చెప్యాల వెంకట్ రెడ్డి, వడ్డేపల్లి ప్రసాద్, నరసింహ ముదిరాజ్, పార్టీ నాయకులు తదితరులు ఉన్నారు.

బీఆర్ఎస్ మండల తాత్కాలిక అధ్యక్షుడిగా రహీమొద్దీన్

దౌల్తాబాద్: బీఆర్ఎస్ మండల తాత్కాలిక అధ్యక్షుడిగా సయ్యద్ రహీమొద్దీన్‌ను నియమించినట్లు దుబ్బాక ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి ఆదివారం ప్రకటనలో పేర్కొన్నారు.

అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి



సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత

హుస్నాబాద్‌రూరల్, ఏప్రిల్ 7: హుస్నాబాద్ పట్టణ అభివృద్ధిలో కవులు, రచయితలు, మేధావులతో పాటు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత పిలుపునిచ్చారు. ఆదివారం హుస్నాబాద్ మున్సిపల్ కార్యాలయంలో ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని జనజాగృతి సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు, కవి, రచయిత ముక్కెర సంపత్ ఆధ్వర్యంలో కవి సమ్మేళనం జరిగింది. కార్యక్రమానికి ముఖ్యతిథిగా హాజరైన మున్సిపల్ చైర్‌పర్సన్ రజిత మాట్లాడారు. కార్యక్రమంలో పలువురు కవులు తమ కవితలను చదివి వినిపించారు. మనిషికి కష్టం వచ్చినప్పుడు కుంగిపోకుండా ధైర్యంగా ముందుకు సాగాలన్నారు. ప్రజలు తమ విశాల హృదయంతో ఆలోచన చేసి మంచి నాయకత్వాన్ని ఎంచుకోవాలన్నారు. వచ్చే ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని నియోజక వర్గంలోని ప్రజలందరూ సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు వాల సుప్రజ, నవన, డీసీసీ సభ్యులు కేడం లింగమూర్తి, గాదెపాక రవీందర్, చిట్టిగోపాల్ రెడ్డి, బూట్ల రాజమల్లయ్య మేకల వీరన్న యాదవ్, శంకర్‌బాబు, తిప్పర్తి శ్రీనివాసులు, గడిపె బాలయ్య లక్ష్మణ్, పి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

తిరుపతయ్యకు ఉగాది పండిత పురస్కారం



పురస్కారాన్ని అందుకుంటున్న పానుగంటి తిరుపతయ్య

మద్దూరు, ఏప్రిల్ 7: మండల కేంద్రానికి చెందిన పానుగంటి తిరుపతయ్యకు జిల్లా కేంద్రంలోని విశ్వబ్రాహ్మణ అర్చక పురోహిత సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఉగాది మహోత్సవ పండిత పురస్కారాన్ని అందించారు.

మెదక్ స్థానాన్ని కలిసికట్టుగా గెలిపించుకుందాం



ములుగులో సీనియర్ కార్యకర్తలతో మాట్లాడుతున్న తూంకుంట నర్సారెడ్డి

ములుగు, ఏప్రిల్ 7: పార్లమెంట్ ఎన్నికల్లో మెదక్ స్థానాన్ని కైవసం చేసుకోవడం కోసం అందరం కలిసి కట్టుగా పనిచేయాలని సిద్దిపేట జిల్లా డీసీసీ అధ్యక్షుడు నర్సారెడ్డి కోరారు. ఆదివారం మండల కేంద్రమైన ములుగులో గజ్వేల్ నియోజకవర్గం యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు కడపల కృష్ణారెడ్డి, అన్నసాగర్ మాజీ సర్పంచ్ సాదుల మహిపాల్‌రెడ్డితో మాట్లాడుతూ.. ఇకనుంచి మండలంలో అందరం కలిసికట్టుగా పనిచేసి కష్టకాలంలో కాంగ్రెస్ పార్టీ కోసం పనిచేసిన కార్యకర్తలకు అండగా ఉండాలన్నారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ మెదక్ ఎంపీ అభ్యర్థి నీలం మధును భారీ మెజార్టీతో గెలిపించుకుందామన్నారు. సమావేశంలో యూత్ సీనియర్ నాయకుడు చింతకింది రాజు, మాజీ ఎంపీటీసీ తమ్మలి శ్రీనివాస్, మాజీ సర్పంచ్ శ్రీధర్‌రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు గణేష్‌యాదవ్, నవీన్, విజయ్, శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన విద్యాప్రమాణాలు





డీఈవో శ్రీనివాస్‌రెడ్డిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు, సిల్వర్‌జూబ్లీ వేడుకల్లో విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శన

కుకునూరుపల్లి, ఏప్రిల్ 7: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా శనివారం రాత్రి సిల్వర్ జూబ్లీ వేడుకలను ప్రధానోపాధ్యాయుడు బచ్చలి సత్తయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. వేడుకలకు ముఖ్యఅతిథిగా డీఈవో శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన విద్య అందుతుందన్నారు. అందరి సహకారంతో పాఠశాల మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. గ్రామ మాజీ సర్పంచ్, పీఎస్ఆర్ ట్రస్ట్ అధినేత పోల్కంపల్లి జయంతి నరేందర్ మాట్లాడుతూ.. విద్యార్థులకు, పాఠశాలకు తనవంతుగా సహాయసహకారాలు ఎల్లప్పుడూ అందిస్తానన్నారు. అనంతరం నిర్వహించిన నాట్య ప్రదర్శనలు, ఆటపాటలు వీక్షకులను ఎంతగానో అలరించాయి. ఈ సందర్భంగా రిటైర్డ్ ఉపాధ్యాయుడు వంగ శ్రీనివాస్ రెడ్డి పాఠశాలకు రూ.50 వేల విలువైన ఇంగ్లిష్ గ్రామర్ పుస్తకాలను అందజేస్తానని తెలిపారు. కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ వనిత శ్రీనివాస్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయులు జానకిరెడ్డి, మహేందర్‌రెడ్డి, చంటి, ఐలయ్య, హాజీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

లద్నూరులో మూతపడ్డ డార్క్ రూం

● రెండేళ్లుగా అందని నేత్రవైద్య సేవలు

మద్దూరు, ఏప్రిల్ 7: మద్దూరు మండలం లద్నూరులోని 24 గంటల ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో రెండేళ్ల క్రితం డార్క్ రూం మూతపడింది. అప్పటి నుంచి మండల ప్రజలకు కంటి పరీక్షల వైద్యసేవలు అందకుండా పోయాయి. గతంలో వారానికి రెండు రోజులు విధులు నిర్వహించే ఆప్తాల్మిక్ అసిస్టెంట్ డిప్యూటేషన్‌పై వెళ్లినట్లు తెలిసింది. నిత్యం కంటి చూపు సమస్యలతో ఆస్పత్రికి వచ్చేవారు కంటి వైద్యపరీక్షలు నిర్వహించే వారెవరూ లేకపోవడంతో వెనుదిరిగి వెళ్తున్నారు. ఉన్నతాధికారుల పట్టింపులేకుండా పోవడంతో డార్క్ రూం మూతపడింది. ప్రభుత్వం డిప్యూటేషన్లు రద్దు చేసినా విధుల్లో చేరకపోవడం శోచనీయం. ఈ విషయమై డిప్యూటీ డీఎంహెచ్‌వో ప్రభాకర్ దృష్టికి తీసుకెళ్లగా ఎన్నికల కోడ్ అనంతరం లద్నూరు పీహెచ్‌సీకి ఆప్తాల్మిక్ అసిస్టెంట్‌ను రప్పించనున్నట్లు చెప్పారు.

ఎన్‌టీఎఫ్ రాష్ట్ర యువజన ప్రధాన కార్యదర్శిగా శ్రావణ్

సిద్దిపేట అర్బన్, ఏప్రిల్ 7: ఆదివాసుల అభివృద్ధి హక్కుల కోసం నిరంతరం కృషి చేయాలని నేషనల్ ట్రైబల్ ఫెడరేషన్ రాష్ట్ర యువజన ప్రధాన కార్యదర్శి కెమ్మసారం శ్రావణ్ పేర్కొన్నారు. రాష్ట్ర అధ్యక్షుడు వలువాయి ఉషాకిరణ్ చేతుల మీదుగా నియామక పత్రం అందుకున్న తర్వాత ఆదివారం సిద్దిపేటలో అయన మాట్లాడుతూ ఆదివాసుల హక్కులకై పోరాడి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో నేషనల్ ట్రైబల్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు నర్సింహులు, ఎస్‌టీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేవరాయి ఎల్లం, ఎస్‌టీఫ్ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు కెమ్మసారం శ్రీనివాస్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బండి యాదగిరి, కెమ్మసారం సంతోష్, నిమ్మ అశోక్, ఎన్‌టీఎస్ఎఫ్ అధ్యక్షుడు మేడ శ్రీనివాస్, అశ్విని, ఝాన్సి తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో చేబర్తి ప్రభుత్వ పాఠశాల పూర్వ విద్యార్థులు

మర్కుక్, ఏప్రిల్ 7: మండలంలోని చేబర్తి గ్రామంలో ప్రభుత్వ పాఠశాలకు చెందిన 2010-11 బ్యాచ్ ఎస్సెస్సీ పూర్వ విద్యార్థులు ఆదివారం స్థానిక గణేష్‌పల్లి గెస్ట్‌హౌస్‌లో ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. పద్నాలుగేళ్ల తర్వాత ఒకచోట సమావేశమైన స్నేహితులు ఆత్మీయంగా పలకరించుకుని పరస్పర యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. గత స్మృతులను నెమరువేసుకుంటూ, ఆటపాటలు, డ్యాన్సులతో రోజంతా సందడి చేశారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను గుర్తు చేసుకుంటూ ప్రధానోపాధ్యాయుడు జయసింహారెడ్డి, ఉపాధ్యాయులను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకటేశం, కనకారావు, భూపతిరెడ్డి, చిన్నికృష్ణ, పూర్వ విద్యార్థులు, కరుణాకర్, భాస్కర్, ఏ బాబు, బాలరాజు, ప్రవీణ్, బాలస్వామి, బలరాం, ఎన్ బాబు, జీ బాలచంద్రం, బాలకృష్ణ, తిరుపతి, శ్రీకాంత్, బాలచంద్రం, నర్సింహులు, ప్రవీణ్, విద్యార్థినులు సంగీత, పద్మ, సునిత, సంతోష, సుజాత, శ్రీవాణి, రాజేశ్వరి, మమత, అమరావతి పాల్గొన్నారు.

ఎంపీడీవో కార్యాలయానికి నీటి గోస

● వంతులవారీగా జీపీల నుంచి ట్యాంకర్‌తో సరఫరా

మద్దూరు, ఏప్రిల్ 7: మద్దూరు ఎంపీడీవో కార్యాలయానికి నీటి గోస తప్పడం లేదు. మిషన్ భగీరథ అధికారులు అందించిన నల్లా కనెక్షన్ ద్వారా సక్రమంగా నీటి సరఫరా కావడంలేదు. దీంతో రాజభవంతిని తలపిస్తున్న ఎంపీడీవో కార్యాలయానికి ఎలాంటి బోరు వసతి లేకపోవడంతో తప్పని పరిస్థితుల్లో వంతులవారీగా గ్రామపంచాయతీల ద్వారా ట్యాంకర్‌తో నీటిని తెప్పించుకుంటూ సంపును నింపుకుంటున్నారు. నీటి వసతి లేక కార్యాలయ సిబ్బంది తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వ కార్యాలయాలకు నీటి అవసరాలు తీర్చుకునేందుకు కనీసం బోరు సౌకర్యాన్ని కూడా ఏర్పాటు చేసుకోకపోవడం విమర్శలకు తావిస్తున్నది. మిషన్ భగీరథ అధికారుల తీరుపై మండల పరిషత్ అధికారులు నోరుమెదపని పరిస్థితి చోటు చేసుకోవడం విడ్డూరం. మండల పరిషత్ కార్యాలయానికి నీటి వసతి ఏర్పాటు చేసుకోలేని అధికారులు ఇక తమ సమస్యలను ఎలా పరిష్కరిస్తారని ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

బీజేవైఎం మండల అధ్యక్షుడిగా సదానందరెడ్డి

మిరుదొడ్డి, ఏప్రిల్ 7: మండల కేంద్రానికి చెందిన సదానందారెడ్డిని ఆదివారం బీజేవైఎం మిరుదొడ్డి మండల అధ్యక్షుడిగా ఆ పార్టీ మండల అధ్యక్షుడు దేవరాజు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు మండల పార్టీ అధ్యక్షుడు దేవరాజు నియామక పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు మల్లేశం, అమర్, కనకరాజు, స్వామి, స్వామి, భాను, రాజు, పరశురాములు, కరుణాకర్, కృష్ణ, రమేష్, నవీన్ తదితరులున్నారు.

సావర్కర్ సేవాసమితి చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న సావర్కర్ సేవాసమితి నాయకులు

సిద్దిపేట అర్బన్, ఏప్రిల్ 7: సిద్దిపేటలోని స్థానిక పాత బస్టాండ్‌లో ప్రయాణికుల దాహార్తి తీర్చడం కోసం సావర్కర్ సేవాసమితి ఆధ్వర్యంలో ఆదివారం చలివేంద్రాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా సేవాసమితి నాయకులు మాట్లాడుతూ సేవా కార్యక్రమాల్లో భాగంగా వేంకటేశ్వర స్వామి ఆలయం పరిధిలో మరో చలివేంద్రాన్ని కూడా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

బోరుమోటార్ కేబుల్ దొంగల అరెస్ట్



వివరాలను వెల్లడిస్తున్న సీఐ

ములుగు, ఏప్రిల్ 7: గత నెల 17వ తేదీన మండలంలోని వంటిమామిడి గ్రామంలో బోర్‌మోటార్ కేబుల్ చోరీకి పాల్పడిన ఇద్దరిని పోలీసులు అరెస్టు చేశారు. ఆదివారం సాయంత్రం గజ్వేల్ రూరల్ సీఐ మహేందర్‌రెడ్డి విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కేసు వివరాలను వెల్లడించారు. ఈ మేరకు.. వంటిమామిడి గ్రామానికి చెందిన పర్వత సంజయ్(19), మంద ప్రశాంత్(19) స్నేహితులు ఓ ప్రైవేట్ కంపెనీలో పనిచేస్తున్నారు. జీతం డబ్బుతో మద్యం సేవిస్తూ జులాయిగా తిరిగేవారు. గత నెల 17న గ్రామంలోని పల్లె ప్రకృతి, శ్మశానవాటిక, సన్నిధానం వద్ద ఉన్న బోరుమోటారుకు ఉన్న కేబుల్ వైర్‌ను దొంగలించి, అడవిలో కాల్చి రాగి వైర్‌ను స్క్రాప్‌ను రూ.2వేలకు అమ్ముకున్నారు.

ఆ డబ్బుతో మద్యం తాగి వంటిమామిడిలో అనుమానాస్పదంగా తిరుగుతుండగా ఎస్ఐ విజయ్‌కుమార్ వారిని అదుపులోకి తీసుకొని విచారించగా తామే కేబుల్ చోరీ చేశామని ఒప్పుకున్నారు. నిందితులను ఆదివారం అదుపులోకి తీసుకొని కేసు దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.